# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం
24 జూలై 2024

తెలంగాణ ప్రాంతీయం




# సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ

## క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన కమిషనర్

**మల్కాజిగిరి, జులై 23(నినాదం న్యూస్)**
రాచకొండ పోలీస్ కమిషనరేట్ సామాజిక మాధ్యమాల అకౌంట్ల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు, వాటిని అందరికీ చేరువ చేసేందుకు మంగళవారం నేరేడ్ మెట్ లోని రాచకొండ కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా, రాచకొండ పోలీస్ "ఫేస్ బుక్" "ఎక్స్" "ఇన్స్టాగ్రామ్" వంటి సామాజిక మాధ్యమాల అకౌంట్లు, యూట్యూబ్ ఛానల్ నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ ఆవరణలో, రిసెప్షన్ లో రాచకొండ పోలీస్ క్యూఆర్ కోడ్ కలిగిన పోస్టర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలంతా ఈ క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకుని, తమ మొబైల్ ఫోన్లలో స్కాన్ చేయడం ద్వారా సంబంధిత రాచకొండ కమిషనరేట్ సోషల్ మీడియా అకౌంట్లకు సులభంగా చేరుకుని సబ్ స్క్రైబ్ చేసుకోవచ్చని, ఫాలో కావచ్చని తెలిపారు. కాలానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు, వారికి మెరుగైన సత్వర సేవలు అందించేందుకు, వారితో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకోవడానికి, ఈ సోషల్ మీడియా అకౌంట్లు దోహదం చేస్తాయన్నారు. ప్రజల్లో రాచకొండ కమిషనరేట్ సోషల్ మీడియా అకౌంట్ల గురించి మరింత ప్రచారం కల్పిస్తామని, ప్రతీ ఒక్కరూ వాటిని ఫాలో కావాలని సూచించారు. వీటి ద్వారా ఎప్పటికప్పుడు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పలు అవగాహన కార్యక్రమాల నిర్వహణ, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం, భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో విపత్తు నిర్వహణ సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రాచకొండ వాట్సాప్ కంట్రోల్ నంబర్ 8712662111 ద్వారా కూడా బాధితులు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. డీసీపీ యాదాద్రి రాజేష్ చంద్ర ఐపీఎస్, డీసీపీ ఎల్ బి నగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డీసీపీ ఎస్బి కరుణాకర్, డీసీపీ క్రైం అరవింద్ బాబు, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, ఐటి సెల్ ఏసిపి నరేందర్ గౌడ్, ఇన్స్పెక్టర్ లు సుధాకర్, గట్టు మల్లు పాల్గొన్నారు.



# ప్రమాదలకు నిలయంగా.. కన్నాల యూటర్న్

- ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరికీ తీవ్ర గాయాలు
- ధ్వంసం అయిన ట్రాక్టర్,కారు
- ప్రాణాలు పోతున్న పట్టించుకోని జాతీయ రహదారి అధికారులు
- రాజకీయ జోక్యాలతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

-మిగతా 2లో

# పండుగ తెచ్చిన వంతెన

- 'శీత్ల' ప్రాంగణానికి తొలగిన రహదారి సమస్య
- మాట నిలుపుకున్న మాజీ సర్పంచి రాజు నాయక్
- సొంత ఖర్చుతో నిర్మాణం, తండావాసుల హర్షం

**గోదావరిఖని జూలై 23(నినాదం) :**
వచ్చిన ప్రభుత్వ నిధులను సైతం కాజేసే ప్రజాప్రతినిధులున్న ప్రస్తుత పరిస్థితుల్లో, సర్పంచి స్థాయి ఓ ప్రజాప్రతినిధి సొంత ఖర్చుతో వంతెన నిర్మించాడు. వారి సామాజిక వర్గం ఏడాది కోసారి జరుపుకునే శీత్ల పండుగ ప్రాంగణానికి గల రహదారి సమస్యను దూరంచేసాడు. **వివరాలివి..** పెద్దపల్లి జిల్లా,పాలకుర్తి మండలం భామ్లా నాయక్ తండాలోని రాజీవ్ తండాలో గిరిజనులు గత 30 ఏళ్లుగా శీత్ల పండుగ జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామానికి పండుగ ప్రాంగణానికి మధ్య ఎస్సారెస్పీ కాలువ ఉండటంతో తండావాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చేది. పండుగ కోసం ప్రతీ ఏడూ సుమారు రెండు మైళ్ల దూరం నడుస్తూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి స్థానిక సర్పంచ్,ప్రస్తుత మాజీ సర్పంచ్ రాజూ నాయక్ చలించారు. వచ్చే శీత్ల పండుగ నాటికి సదరు కాలువపై ఎలాగైనా వంతెన నిర్మిస్తానని తాండావాసులకు మాటిచ్చారు. ఇచ్చిన మాటప్రకారం ఎస్సారెస్పీ కాలువపై వంతెన నిర్మించారు. దీంతో బామ్లానాయక్ తండా గ్రామస్తులకు శీత్లా పండుగ ప్రాంగణానికి వెళ్లే రహదారి సమస్య శాశ్వతంగా తీరింది. రేపు జరుపుకోనున్న పండుగ నేపథ్యంలో మంగళవారం సదరు వంతెనను మాజీ సర్పంచ్ రాజు నాయక్ ప్రారంభించారు.



ఏళ్లతరడి ఉన్న సమస్యను దూరం చేసిన రాజు సామాజిక బాధ్యతపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, గ్రామ పెద్దలు మధు,( సమ్మయ్య) పులచంద్, చందు నాయక్, గట్టయ్య, తిరుపతి, సంపత్, సురేష్, కిషన్,భోజ్య నాయక్, సారయ్యా, పున్నంచంద్, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# దోమల వ్యాప్తిని అరికట్టేలా విస్తృత ప్రచారం

## జిల్లా కలెక్టర్ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, జులై23(నినాదం)**
దోమల వ్యాప్తి అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆశా కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎలిగేడు మండలం సుల్తాన్పూర్ గ్రామంలో పల్లె దవాఖాన, ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి , ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలతో కలెక్టర్ సమీక్షించారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టేలా, ఆహారం, తాగునీరు పట్ల ప్రజలు శ్రద్ధ వహించే విధంగా ఆశా కార్యకర్తలు ప్రచారం చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న గర్భిణీ స్త్రీల ఆరోగ్యం పట్ల వైద్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.రెగ్యులర్ గా వైద్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన మందులు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు టీకాలు సకాలంలో అందించాలని అన్నారు. ఆర్.బీ.ఎస్.కే సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పి.హెచ్.సి పరిధిలో పిల్లల ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలన్నారు. అంగన్ వాడి కేంద్రాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లల ఎదుగుదల పరిశీలించాల న్నారు. అనంతరం ఎలిగేడులోని ఎస్బిఐని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి ప్రభుత్వం విడుదల చేసిన రైతు రుణమాఫీ నిధులు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు



తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు.

**మెరుగైన విద్యనందించాలి**
విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బుర్హాన్ మియాపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్ వాడి కేంద్రాన్ని చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరీక్షించారు. ఏకరూప దుస్తులు,



## కెజిబివి తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**పాలేరు జూలై 23(నినాదం న్యూస్)**

తిరుమలాయపాలెం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయ ఆవరణ, లోపల పరిశీలించిన అదనపు కలెక్టర్, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలో తరగతుల నిర్వహణ, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందించారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన, కాస్మెటిక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందిస్తున్న ఆహారం రుచిగా, శుభ్రంగా ఉంటుందా, కోడి గుడ్లు, పండ్లు వంటి పౌష్టికాహారం అందిస్తున్నారా వివరాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యాలయం లోని టాయిలెట్స్, హాస్టల్ ప్రాంగణం, వంట చేసే ప్రాంతాలను పరిశీలించారు. స్టోర్స్ లోని సరుకులను పరిశీలించారు. తాజా సరుకులను అందించాలని, హాస్టల్ లోపల, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అదనపు కలెక్టర్ అన్నారు.

## ప్రతి కాలనీ అభివృద్ధికి కృషి

**కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్**



**అల్వాల్, జూలై 23( నినాదం న్యూస్)**

ఆల్వాల్ డివిజన్ కౌకూర్ లోని కాలనీలలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల కోసం రెసిడెంట్స్ సంక్షేమ సంఘం సభ్యుల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ రాజ్ జితేంద్రా నాథ్ వివిధ కాలనీలలో పాదయాత్ర నిర్వహించారు. కాలనీలలో వీధిలైట్లు, రోడ్లు, ఎవెన్యూ ప్లాంటేషన్ కొత్త కాలనీల్లో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యలపై ప్రతిపాదనలు సమర్పించి పనుల మంజూరుకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లికార్జున్, లడ్డూ, శ్రీనివాస్, కవిత, సంజీవ, పప్పుభాయి, వీవీఆర్, శివరాజ్, గౌతం, శంకుంతల నాయుడు, వెంకటేశ్, బాబు అన్న, రూపేందర్‌రెడ్డి, సాయి, విష్ణు, ఆంజనేలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్**

**పాలేరు జూలై 23(నినాదం న్యూస్)**

వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్, తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రానికి వైద్య పరీక్షలకు సేకరిస్తున్న నమూనాలను గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ అన్నారు.



# ప్రమాదాలకు నిలయంగా కన్నాల యూటర్న్

**బెల్లంపల్లి జులై 23 (నినాదం న్యూస్)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని తిరుమల హిల్స్ ఎదురుగా గల 363జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ను లారి డీ కొట్టగా ఆ ట్రాక్టర్ కారు (ఎపి15ఎపి8024) ను బలంగా డీ కొట్టడంతో కాగజ్ నగర్ కు చెందిన గొల్లపూడి రవికుమార్,అనూష జ్యోతిలకు తీవ్ర గాయాలయ్యాయి.ఈ రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే రూరల్ సిఐ అఫ్జలుద్దిన్,తాళ్ల గురజాల,టూ టౌన్ ఎస్ఐలు నరేష్,రమేష్ లు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను108అంబులెన్స్ ద్వారా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



**ప్రమాదాలకు నెలవుగా కన్నాల యూటర్న్**

ఈ యూటర్న్ పై సంబంధిత అధికారులు నామమాత్రపు విచారణలు జరుపుతు చేతులు దులుపుకుంటున్నారని సోషల్ మీడియాలో చర్చలు నడుస్తున్నాయి. ఈ యూటర్న్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇప్పటికే 9మంది ప్రాణాలు కోల్పోయారు.కన్నాల 363జాతీయ రహదారిపై ఉన్న ఈ యూటర్న్ వద్ద గతంలో బెల్లంపల్లిలో కూలి పనులకు వెళ్లి తాండూరుకు వెళ్తుండగా ట్రాలీని లారీ ఢీకొట్టడంతో ముగ్గురు కూలీలు,అదేవిధంగా శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చనిపోయారు.అదే వారంలో మరో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు.మరో ప్రమాదంలో మరో యువకుడు మృతి చెందాడు.అంతేకాకుండా గతంలో ఇదే యూ టర్న్ వద్ద జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది కాళ్ళు,చేతులు కోల్పోయి అచేతనంగా ఇంకా ఆసుపత్రులలోనే విగత జీవులుగా పడి ఉన్నారు.అయితే ఈ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ అభివృద్ధి,మెప్పు కోసమే నాటి బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధి సహకారంతో ఈ యూటర్న్ ఎర్పాటు చేసినట్లు గతంలో అనేక ఆరోపణలు వ్యక్తం అయ్యాయి.ఎంతోమంది ప్రాణాలను బలిగొంటున్న ఈ యూటర్న్ ను వెంటనే తీసివేయాలని అనేకమంది జిల్లా కలెక్టర్,ఆర్ డి ఓ,తహసీల్దార్ లకు, అదేవిధంగా జాతీయ రహదారి అధికారులకు వినతి పత్రాలు అందజేసి, ఆందోళనలు చేపట్టినా అధికారులు మాత్రం ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారికే మద్దతు పలుకుతున్నారని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు.అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా అధికారులు తూ తూ మంత్రంగా అప్పుడప్పుడు అడపాదడపా విచారణలు జరుపుతున్నట్లు సమావేశాలు నిర్వహిస్తు చేతులు దులుపుకుంటున్నారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**కోర్టులో పోరాడుతా**

**- మాదిరి రాకేష్ న్యాయవాది.**

కన్నాల తిరుమల వెంచర్ ఎదురుగా ఉన్న 363జాతీయ రహదారి యూటర్న్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో మహిళ,వృద్ధునికి తృటిలో ప్రాణాపాయం తప్పింది.ఇప్పటికే ఇక్కడ ఎన్నోసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి చాలామంది మరణించారు.ఈ రోడ్డు ప్రమాదాల సమస్యపై గత జూన్ నెలలో ఢిల్లి కి వెళ్లి కేంద్ర రోడ్డు భవనాలు,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరి,ఎన్ హెచ్ ఎ ఐ అధికారులైన చైర్మన్,విజిలెన్స్ చీఫ్ అధికారి,ఎండి,ఎంపి లకు వినతిపత్రం అందజేసాను.మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద సంఘటనపై అతి త్వరలోనే రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ కూడా వేసి ఇక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకై పోరాడుతాను.

**యూటర్న్‌ను వెంటనే మూసివేయాలి**

**- వెంకటేష్ ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి.**

తిరుమల వెంచర్ వద్ద 363 జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన యూటర్న్ ను వెంటనే మూసివేయాలి. ఇప్పటికే 9మంది మరణించగా మరో 10మంది తీవ్ర గాయాలపై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఇక్కడ ఏర్పాటు చేసిన యూటర్న్ ఎవరు మెప్పుకోసం అధికారులు ఏర్పాటు చేశారు త్వరలో ప్రజల ముందు ఉంచుతాం. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పనీయకుండా ఒక మాజీ సర్పంచ్ ను సైతం కలవనీయకుండా,కన్నాల యూటర్న్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చకుండా ఎంత మంది ప్రాణాలను బలిగొంటారు.యూటర్న్ వల్ల జరిగే ప్రమాదాలను ఎమ్మెల్యేకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేసే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపాలి.

**యూటర్న్ వల్లే ప్రమాదాలు**

**- మంద అనిత కన్నాల మాజీ సర్పంచ్.**

బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని తిరుమల వెంచర్ ఎదురుగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన యూటర్న్‌ను వెంటనే మూసివేయాలి. ఈ యూటర్న్ వల్ల జరుగుతున్న ప్రమాదాలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వివరించాను.ఈ క్రమంలో ఆయన పిఎ లు తనని అడ్డుకొని అక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగడంలేదని ఎమ్మెల్యేని సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు.బెల్లంపల్లి ఎమ్మెల్యే,సంబంధిత ప్రభుత్వ అధికారులు,జాతీయ రహదారి అధికారులు చొరవ తీసుకొని వెంటనే ఈ యూ టర్న్ ను మూసివేయాలి.

# దోమల వ్యాప్తిని అరికట్టేలా విస్తృత ప్రచారం

(మొదటిపేజీ తరువాయి..)

మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు తప్పనిసరిగా చదవడం , రాయడం, బేసిక్ మ్యాథ్స్ రావాలన్నారు. బుర్హాన్ మియాపేట గ్రామంలోని అంగన్ వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ గ్రామంలో గర్భిణులను 100 శాతం ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ చేసి, రెగ్యులర్ పరీక్షలు చేయించుకునేలా చూడాలని అన్నారు. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని అన్నారు.



**రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి**

స్వశక్తి మహిళా సంఘాల రుణాల లక్ష్యం సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీ హర్ష అన్నారు. ఎలిగేడు మండలం ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళ వారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షసందర్శించారు. మహిళా శక్తి కార్యక్రమం, స్వశక్తి మహిళా సంఘాల రుణాలు వంటి పలు అంశాల పై కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎలిగేడు తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి గడువు లోగా పెండింగ్ ధరణి దరఖా స్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో రవీందర్, డీఎల్పీవో వేణుగోపాల్, ఎ.పి.డి సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కరరావు, తహసిల్దార్ స్వర్ణ, మండల పంచాయతీ అధికారి అనిల్ రెడ్డి, ఐకేపి ఎపిఎం సుధాకర్ పాల్గొన్నారు.

# పి.ఆర్.టి.యు సభ్యత్వ నమోదు ప్రారంభం

**మునగాల,జులై 23 (నినాదం న్యూస్):** మునగాల కేంద్రంలోని స్థానిక జడ్పిహెచ్ఎస్ భోజన విరామ సమయంలో తెలంగాణ పి.ఆర్.టి.యు రాష్ట్ర, జిల్లా శాఖ పిలుపుమేరకు మండల శాఖ అధ్యక్షులు కాసాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మేకల మధుబాబు ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పదోన్నతులు పొంది, వివిధ ప్రాంతాలలో పనిచేస్తూ మునగాల మండలంనకు విచ్చేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా గౌరవాధ్యక్షులు బొల్లికొండ కోటయ్య, మాజీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఓరుగంటి రవి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కట్కూరి మధుసూదన్ రెడ్డి, కొల్లు వెంకటేశ్వరరావు,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పప్పుల వీరబాబు,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తీగల, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పిడతల వెంకటేశ్వర్లు, మునగాల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీమతి సాయి ఈశ్వరి, కేజీబీవీ ఎస్ ఓ సునీత రాణి,జిల్లా నాయకులు,మండల నాయకులు మండలంలోని క్రియాశీల కార్యకర్తలు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వాసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

**- రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి**

**- ఐద్వా మండల కార్యదర్శి బెల్లం లక్ష్మి డిమాండ్**

**పాలేరు జూలై 23(నినాదం న్యూస్)**

నేలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐద్వా మండల కార్యదర్శి బెల్లం లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సమస్యలపై స్థానిక వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ప్రతిరోజు వందలాదిమంది జ్వర పీడితులు ఆసుపత్రికి వస్తుండడంతో ఆసుపత్రిలో వారికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడంతో పాటు వాటిపై పరుపులు లేక వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఆసుపత్రిలో అపరిశుభ్ర వాతావరణంతో పాటు బాత్రూములు, మరుగుదొడ్లు కంపు కొడుతుండడంతో ఆసుపత్రికి రావాలంటేనే జనం



భయపడుతున్నారన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సరిపడా వైద్యులు, సిబ్బంది లేక రోగులు గంటల తరబడి క్యూ లైన్ లో నిల్చోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులందరికీ అవసరమైన పరీక్షలు నిర్వహించడంలో మందులు పంపిణీ చేయడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతుం దన్నారు. ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యల కారణంగా నేలకొండపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన ప్రజలు ఆసుపత్రికి రావాలంటేనే భయపడుతున్నారన్నారు. గత్యంతరం లేక రోగులు తమ జబ్బు నుండి బయట పడేందుకు, ప్రాణాలు రక్షించుకునేందుకు ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారన్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు అనేక రకాల పరీక్షల పేరుతో పేదల నుండి అందిన కాడికి దండుకుంటున్నారన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల మాయాజాలంతో పేద ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. వచ్చిన జబ్బును నయం చేయించుకునేందుకు అందిన కాడికి అప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించేలా ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆసుపత్రిలో వైద్యాధికారులు, సిబ్బంది ప్రతిరోజు రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని, రోగులకు అవసరమైన పరీక్షలను నిర్వహించి సకాలంలో మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిని సందర్శించిన వారిలో ఐద్వా మండల నాయకులు మున్నంగి లక్ష్మి, సిరికొండ వెంకట్రావమ్మ, వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు

# మట్టిపనికైనా ఇంటోడే ఉండాలి

**- పార్లమెంటులో తెలంగాణ వాదుల ప్రాతినిధ్యం అవశ్యం**

**- మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి జిల్లా ప్రతినిధి జూలై 23( నినాదం న్యూస్)**

పార్లమెంటులో తెలంగాణ వాదుల ప్రాతినిధ్యం ఉండడం అవశ్యకం ఎంతైనా ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు పార్లమెంటులో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఉండడం వల్ల తెలంగాణకు ఏం న్యాయం జరిగిందని 400 సీట్లు గెలుస్తామన్న బీజేపీ చివరకు ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం దక్కించుకుందని తెలిపారు ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారం దక్కుతుందనుకున్న కాంగ్రెస్ అందనంత దూరంలో ఆగిపోయిందని అధికారం నిలబెట్టుకోవడానికి బీజేపీ ఆంధ్ర, బీహార్ రాష్ట్రాలకు బడ్జెట్లో వరాలు ప్రకటించినట్లు చెప్పారు. ఆంధ్రాకు నిధులు దక్కడం ఆహ్వానించదగ్గ పరిణామమే సంతోషకరమే మరి తెలంగాణలో 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి ఏం లాభం అందుకే తెలంగాణ అస్తిత్వం ఉన్న బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని ప్రజలను కోరింది ప్రాంతీయ పార్టీలతో ఏం పని అని జాతీయపార్టీలు



ఎన్నికల్లో చెబుతున్నాయి అవే ప్రాంతీయ పార్టీలను బతిమాలి పొత్తు పెట్టుకుని జాతీయ పార్టీలు అధికారంలోకి ఎందుకు వస్తున్నాయి అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీలకు జాతీయ ఎన్నికల్లో ఏం పని అంటున్న కాంగ్రెస్, బీజేపీలకు గ్రామస్థాయి సర్పంచ్, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయడం ఎందుకు అందుకే జాతీయ పార్టీల వాదన పిచ్చి వాదన .. ఆయా రాష్ట్రాల అవసరాలు ప్రత్యేకంగా ఉంటాయి .. అక్కడి అవసరాలు ఏంటి అని ఆయా రాష్ట్రాల ఎంపీలకు కొట్లాడి నిధులు తీసుకువస్తారు అని పేర్కొన్నారు. లేదా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో మిత్రపక్షంలో ఉన్న వారు తీసుకువస్తారు. అందుకే తెలంగాణ ఎంపీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉండాలని మొత్తుకున్నాం జాతీయ పార్టీలతో ఎన్నడూ రాష్ట్రాలకు ప్రయోజనం ఉండదు ప్రాంతీయ పార్టీలే శ్రీరామరక్ష బడ్జెట్లో తెలంగాణను విస్మరించడం కాంగ్రెస్, బీజేపీ పార్టీ ఎంపీల వైఫల్యానికి నిదర్శనం కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధులు కేటాయించక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

## కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చే బడ్జెట్

**- ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్**



**కరీంనగర్, జూలై 23(నినాదం న్యూస్ )**

కార్పొరేట్ కంపెనీలకు బహుళ జాతి సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. పేద ప్రజల ఆశలను ఆవిరి చేశారని కరీంనగర్ జిల్లా కు నిధుల కేటాయింపు విషయంలో బిజెపి ఎంపీలు ఆశా జనకంగా బడ్జెట్‌ను మంజూరు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి బిజెపి ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఈ బడ్జెట్ కనిపిస్తోందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో మరోసారి పేద ప్రజలపై ప్రతాపాన్ని చూపించిందని, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరే విధంగా పేద ప్రజలకు నిరాశ కలిగించే విధంగా మోడీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టి వారి పేద ప్రజల వ్యతిరేక విధానాన్ని మరోసారి ప్రదర్శించిందన్నారు. జిల్లా, రాష్ట్ర ప్రయోజనాల కోసం బడ్జెట్లో నిధుల కేటాయింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రాష్ట్ర అభివృద్ధి విషయంలో వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో తేట తెల్లమైందని తెలిపారు.

## నేడు వొడితల రాజేశ్వరరావు 13 వ వర్ధంతి

**- ప్రణవ్ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు**

**- కార్యక్రమానికి హాజరుకానున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**జమ్మికుంట, జూలై 23 (నినాదం న్యూస్) :**

మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వరరావు 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేయనున్నారు. ఉన్నతమైన విలువలతో స్వచ్ఛమైన రాజకీయ నాయకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గొప్ప నాయకుడు రాజేశ్వరరావు. సింగపూర్ రాజేశ్వరరావుగా రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితులు. రాజేశ్వరరావు వర్ధంతిని ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో నేడు హుజురాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కోడూరి



సత్యనారాయణ గౌడ్, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



## బిఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఇల్లందు,జూలై23(నినాదం న్యూస్):**

సింగరేణి గుర్తింపు సంస్థ బిఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఇల్లందులో ఘనంగా జరుపుకున్నారు.మంగళవారం పట్టణంలోని స్థానిక జేకే కాలనీ బిఎంఎస్ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను ఆవిష్కరించారు.సింగరేణి కార్మికుల సమస్యల కొరకు బిఎంఎస్ నిరంతరం కృషి చేస్తుందని ఏరియా ఉపాధ్యక్షులు నాయని సైదులు అన్నారు.కార్యక్రమంలో ఏరియా సెక్రటరీ లీల కృష్ణ,సెంట్రల్ కార్యదర్శి ఆరుట్ల మాధవరెడ్డి,జాయింట్ సెక్రటరీ నాగేశ్వరరావు,ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్,కోశాధికారి శశి కుమార్,కార్యవర్గ సభ్యుడు రాంబాబు,రాము,పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ గుడి స్థలం పరిశీలన



**కారేపల్లి, జూలై 23 (నినాదం న్యూస్):**

కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి స్థలాన్ని మండల తాహసిల్దార్, సేవాలాల్ కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఏజెన్సీ మండలమైన సింగరేణి మండలంలో అధిక శాతం గిరిజనులే ఉండడంతో లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గుడిని నిర్మించాలని గత కొన్ని సంవత్సరాలుగా గిరిజన సంఘం నాయకులు,గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు గతంలో పలుమార్లు విన్నవించుకున్న ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వ హయంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ను లంబాడ గిరిజన సంఘం నాయకులు ప్రత్యేకంగా విన్నవించుకొని కోరడం జరిగింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మండల తహసిల్దార్ ను మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాన్ని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణం కోసం పరిశీలించాలని ఆదేశించారు.దాంతో మండల తాహసిల్దార్ వసంత్ కుమార్,సేవాలాల్ కమిటీ సభ్యులు వాంకుడోత్ గోపాల్ నాయక్, బానోత్ రాములు నాయక్, బానోత్ హీరోలాల్ నాయక్,శంకర్ నాయక్, ఠాగూర్, గిరిజన సంఘం నాయకులు రాములు చౌహాన్, దేవు సింగ్ నాయక్,వాగ్య నాయక్ పలువురు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే ప్రభుత్వ స్థలంలో సేవాలాల్ గుడి నిర్మాణం చేపట్టే కార్యక్రమం ఉంటుందని లంబాడ గిరిజన సంఘం నాయకులు తెలిపారు.

## ఎల్ఒసి అందజేసిన ఎమ్మెల్యే

**అల్వాల్, జూలై 23 (నినాదం న్యూస్)** బోయిన్పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్స కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎల్.ఓ.సిలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డోలీ రమేష్, మల్లేష్ గౌడ్, శోభన్ బాబు, శరత్ గిరి, ఉష, సంతోష్ గుప్తా, శైలెందర్ తదితరులున్నారు.



# పదోన్నతుల ద్వారా మరింత ఉద్యోగ బాధ్యత

## రామగుండం పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్

**ఆదిలాబాద్ బ్యూరో జులై 23 (నినాదం న్యూస్)**

ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల ద్వారా ఉద్యోగ ఉద్యోగ బాధ్యత మరింత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎఎస్ఐ లు గా పనిచేస్తు ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన 7గురు,అదేవిధంగా హెడ్ కానిస్టేబుల్ లుగా పనిచేస్తు ఎఎస్ఐ లుగా పదోన్నతులు పొందిన 6గురు,16మంది కానిస్టేబుల్ లు హెడ్ కానిస్టేబుల్ లుగా పదోన్నతులు పొందిన సిబ్బందిని పోలీస్ కమీషనర్ రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో అభినందించి వారి ర్యాంకుల వారిగా పదోన్నతుల చిహ్నాలను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతు పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా తమ స్థాయితో పాటు బాధ్యత మరింత పెరుగుతుందని,పెరిగిన బాధ్యతను క్రమశిక్షణా యుతంగా నిర్వహిస్తు ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని,గౌరవాన్ని పెంపొందించే దిశగా పనిచేయాలని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు.ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని,కష్టపడి పని చేస్తే ఏ ఉద్యోగికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎ విధమైన క్రమశిక్షణతో విదులు నిర్వర్తించారో అదేవిధంగా భవిష్యత్తులోను మిగతా పదవి కాలం పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.అంతేకాకుండా ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ



వహించాలని,ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటారని,మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరు శ్రమించాలని,ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు,స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘువేంద్రరావు,ఎఆర్ ఎసిపి ప్రతాప్,ఎఓ అశోక్ కుమార్,ఆర్ఐ లు దామోదర్,మల్లేశం,మధు,సూపరిండెంట్ లు ఇంద్రసేనారెడ్డి,సందీప్,మనోజ్ కుమార్,సంధ్య,సిసి గౌస్ రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి సేకరిస్తున్న భూములను రీ సర్వే చేయాలి

## దళిత రైతుల విజ్ఞప్తి

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 23(నినాదం న్యూస్ )**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బేన మండలం గోలేటిలో సింగరేణి తీసుకోబోతున్న 58.09ఎకరాల భూమి పై అవార్డ్ ఆమోదం నిలిపివేసి రీ సర్వే చేయించడం కోసం మంగళవారం రోజున దళిత రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో జీవనోపాధి, పునరావాసం కల్పిం చుట, ఎకరానికి 10 లక్షలు తక్కువ కాకుండా నష్ట పరిహారం ఇప్పించుట, గోలేటి గ్రామంలోని నిరుపేద దళిత రైతులు సింగరేణి సేకరిస్తున్న 58.09 ఎకరాల భూమి విషయంలో సింగరేణి అధికారులు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో సోషల్ ఆడిట్, సర్వేలో అనేక తప్పులు నమోదు చేశారని ఆరోపించారు. అవార్డు ఎంక్వైరీ రోజున మేము రి సర్వే చేయమని ఆర్డిఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అప్పటి ఆర్డీవో సురేష్ రీ సర్వే చేయమని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు కూడా రి సర్వే నిర్వహించలేదని తెలిపారు . నూతన అసిఫాబాద్ ఆర్డిఓ లోకేష్ గారి వద్దకు పలుమార్లు వెళ్లి రీసర్వే గురించి అడగగా రీ సర్వే చేయలేమని తెలిపారు.దీనితో సుమారు 20 మంది రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని భూ నిర్వాసితుల పట్ల ఆర్డిఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు సింగరేణి అధికారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎకరానికి ఎంత చెల్లిస్తున్నారన్న విషయం తెలపకుండా ఆర్డిఓ ఆఫీస్ లో అవార్డు ఆమోదం కోసం జరగాల్సిన భూనిర్వసితుల సంతకాల సేకరణ కొంతమంది దళారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి సంతకాల సేకరణ చేస్తున్నారని ఇట్టి అవార్డు ఆమోదాన్ని రద్దు చేయలని , రీ సోషల్ ఆడిట్ మరియు రీ సర్వే నిర్వహించే విధంగా ఉత్తర్వులు ఇచ్చి సహకారం అందించగలరని వేడుకున్నారు. ఈ కార్యక్రమం లో గోలేటి రైతులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**బెల్లంపల్లి జులై 23 (నినాదం న్యూస్)**

బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎంసిపిఐ(యు)పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పట్టణంలో సానిటేషన్,వీధి కుక్కల బెడద,రోడ్లపై గుంతలు,వార్డులలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతు ఒడడం లాంటి అనేక సమస్యలు ఉన్నాయని అని అన్నారు. అదేవిధంగా 34వార్డులలో శానిటేషన్ లేక దోమలు,ఈగలు వ్యాప్తి చెందుతుండడం వలన ప్రజలకు డెంగ్యూ మలేరియా వచ్చే అవకాశం ఉన్నందున,వెంటనే వార్డులలో శానిటేషన్ పనులు చేయించాలని కోరారు. అదేవిధంగా కాల్ టెక్స్ నుండి కొత్త బస్టాండ్ వరకు రోడ్డుమీద పెద్ద పెద్ద గుంతలు ఉండడం వలన బాటసారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని,అదేవిధంగా వార్డులలో వీధి కుక్కలు చిన్నా పెద్ద అని తేడా లేకుండా అందరిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని అన్నారు.పలు వార్డులలో 24గంటల వీధిలైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని,నిత్యం వీధిదీపాలు వెలగడం వల్ల ప్రజల మీద భారం పడే అవకాశం ఉన్నదని వారు అన్నారు.పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని లేని యెడల ఎంసిపిఐ(యు)పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

# నిషేధిత గుట్కా, అంబార్ ప్యాకెట్లు పట్టివేత

**భీమదేవరపల్లి జూలై 23(నినాదం న్యూస్)**

హుజురాబాద్ నుంచి ఆటోలో గుట్కా ప్యాకెట్లను తీసుకొస్తుండగా మంగళవారం భీమదేవరపల్లి క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన కాసగొని యాకయ్య(ఆటో డ్రైవర్), కందిమల్ల వేణుగోపాల్(కిరాణా షాప్ యజమాని) కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు ఆటోలో తీసుకొస్తుండగా భీమదేవరపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్ల విలువ రూ.18 వేలు ఉంటుందన్నారు. ఆటోను, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయిబాబు తెలిపారు.




# ఉపాధి హామీలో భారీ అవినీతి !

**సామాజిక తనిఖీల్లో వెల్లడి**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి**
**జులై 23 (నినాదం న్యూస్ )**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం రోజున, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం పై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో, గత ఆర్థిక సంవత్సరం 01-04-2023 నుండి 31-04-2024 వరకు మండలంలో రూపాయలు 6 కోట్ల 41,87,691 రూపాయల పనులు చేపట్టారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందాలు, 11వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం అమలులో భారీ అవినీతి చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. 27 గ్రామ పంచాయతీల పరిధిలో 530 పనులు చేపడితే అందులో ప్రతి అంశం లో అవినీతి చోటు చేసుకున్నదని, 54 అంశాల వారీగా ఆయా గ్రామ పరిధిలో చేపట్టిన పనులు, గుర్తించిన లోసుగులు,అవినీతిని సామాజిక తనిఖీ బృంద సభ్యులు ప్రజావేదికలో చదివి వినిపించారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పనులలో అవినీతి,అవకతవకలు బహిర్గతమైనాయి. సామాజిక తనిఖీ బృందాలు, ఉపాధి హామీ కూలీలకు చెల్లించే కూలి డబ్బులలో సైతం అవకతవకలు జరుగుతున్నాయని, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ల వలన సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు చెల్లించే కూలీ డబ్బులలో, చిన్న చిన్న పద్దులను బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు తీసుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు చెల్లింపులలో మాస్టర్ వైస్ చెల్లింపులు కాకుండా,




గంప గుత్తగా చెల్లిస్తున్నారని, అందరికీ సమానంగా కూలీ డబ్బులు ఇస్తున్నారని, దీనివలన ఎక్కువ పని చేసిన వారు నష్టపోతున్నారని తక్కువ పని చేసిన వారు ఎక్కువ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అదేవిధంగా చేసిన పనులలో కొలతలలో భారీ తేడాలు ఉన్నాయని గుర్తించారు. గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామసభల తీర్మానాలకు వారు చేసిన పనులకు పొంతన కుదరడం లేదని తెలిపారు. గ్రామ స్వరోధార నిర్ణయించిన పనులు చేయాలని నియమ నిబంధనలు ఉంటే తీర్మానాలకు సంబంధించిన పనులు, మోకా మీద ఉండడం లేదని తెలిపారు. చేసిన పనులకు తీర్మానాలకు పొంతన కుదరడం లేదని తెలిపారు. వ్యవసాయ భూములకు రహదారుల నిర్మాణంలో సైతం అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. గ్రామాలలో రైతులకు నిర్మించి ఇచ్చే పశువుల పాకల నిర్మాణాలు అంచనాల ప్రకారం నిర్మాణం జరగలేదని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్మించిన ఊట కుంటలు పార్కులేషన్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టకుండానే చెల్లింపులు చేశారని తెలిపారు. ఉపాధి హామీ లో మొక్కల పెంపకం కు ఎంతో ప్రాధాన్యత ఉండగా, నాటిన మొక్కలలో కేవలం 38% మాత్రమే ఉన్నాయని, రికార్డులలో మాత్రం 98 శాతం ఉన్నట్లు రికార్డులు రాశారని తెలిపారు. వాస్తవానికి మొక్కలు ఎండిపోయిన తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రికార్డులలో చాలా తప్పులు ఉన్నాయన్నారు. ఎండిపోయిన మొక్కలను తొలగించి మళ్లీ మొక్కలను నాటాలని నిబంధనలో ఉన్న నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని సామాజిక తనకి బృందాల వారు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 54 అంశాలలో ఏ ఒక్క అంశంలో కూడా ఉపాధి హామీ సిబ్బంది, అధికారులు నీయమ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం సిబ్బంది నిర్లక్ష్యం విరసి ఈ పథకంలో ప్రతి ఒక్కరూ అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీలలో బహిర్గతమైంది. ప్రజా వేదికలో అవినీతి అక్రమాలపై, సామాజిక తనిఖీ బృందాల వారు చదివి వినిపిస్తుంటే, కుంటి సాకులు చెబుతూ తప్పించుకోవాలని చూస్తున్నారు. భారీ ఎత్తున జరిగిన ఈ అవినీతిపై విజిలెన్స్ ఎంక్వయిరీలు చేస్తే మరిన్ని అవినీతి అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశమున్నది. 11 సంవత్సరాలుగా సామాజిక తనిఖీలలో బయటపడుతున్న, సిబ్బందిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రతి సంవత్సరం యధావిధిగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

ఈ ప్రజా వేదిక సమావేశంలో డి ఆర్ డి ఏ అధికారి సురేందర్, ఏ.వి. ఓ. కృష్ణమూర్తి, అంబుడ్స్ పర్సన్ సాయి శ్రీ, సోషల్ ఆడిట్ ఏపీసి కే శ్రీధర్, ఎస్ ఆర్ పి డి మహేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# మంచిర్యాల పట్టణంలో రహదారి మార్గాలు అస్తవ్యస్తం





**మంచిర్యాల టౌన్ జూలై 23 (నినాదం న్యూస్ ):** మంచిర్యాల పట్టణం దాదాపుగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో పట్టణ ప్రాంతాల్లో మరియు పరిసర ప్రాంతాలలో వివిధ ప్రాంతాలను కలుపుకొని ఉన్న జాతీయ రహదారులు పగుళ్ళతో అలాగే వంపుమిట్టలతో అస్తవ్యస్తంగా రోడ్డు వ ా ం ా ్ర ల ు దర్శనమిస్తున్నాయి. రహదారులపై ప్రయాణించే వాహనదారులు ఏదో ఒక సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలోనే కాకుండా పట్టణంలోని వివిధ కాలనీలలో సైతం రోడ్డు మార్గాలు చిద్రమై పగుళ్ళతో అంద వికారంగా వాహనాలు నడపడానికి వీలు లేకుండా పలు కాలనీలలో రహదారి మార్గాలు ఉన్నాయి. ముఖ్యంగా పాత మంచిర్యాల వాగు పై గల బ్రిడ్జిపై ఉన్న రహదారిపై గుంతలు పగుళ్లు ఏర్పడ్డాయి. అంతేగాకుండా బెల్లంపల్లి చౌరస్తా నుండి మొదలుకొని ఐ బీ చౌరస్తాలో రోడ్డు మార్గం గుండా గుంతలు ఏర్పడ్డాయి. పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి మొదలుకొని బెల్లంపల్లి చౌరస్తా వరకు గుంతలు పగుళ్ళతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పట్టణ ప్రాంతంలో గల వివిధ కాలనీలలో రాంనగర్, కాలేజీ రోడ్, అశోక్ రోడ్డు, హమాలివాడ, గోపాల్ వాడ, గాంధీ నగర్,జన్మభూమి నగర్, రాళ్లపేట రోడ్డు, ఇలా అనేక మార్గాలలో గుంతలు పగుళ్లతో రోడ్డు మార్గాలు చిద్రమై వాహనదారుల యొక్క ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇంత జరుగు తున్న స్థానిక ప్రజాప్రతినిధులు అయినా మంచిర్యాల పురపాలక సంఘం చైర్ పర్సన్ అలాగే స్థానిక ఎమ్మెల్యే రోడ్డు మార్గాల యొక్క మరమ్మత్తుల కోసం చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు వాహనదా రుల యొక్క కష్టాలను అర్థం చేసుకుని రోడ్డు మార్గాల మర మ్మత్తులకు చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు.





# అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు తీసుకున్న నంది రవీందర్



**బెల్లంపల్లి జులై 23 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా న్యాయస్థానం లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నంది రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.గోదావరిఖని నుండి సాధారణ బదిలలో భాగంగా మంచిర్యాలకు బదిలీ పై వచ్చారు. కాగా ఆయన జూనియర్ సివిల్ జడ్జి అవ్వడమే లక్ష్యంగా సిద్ధమవుతున్నారు. అయిదు సార్లు మౌఖిక పరీక్ష వరకు వెళ్లి జడ్జి కాలేక పోయినా, నిరాశ చెందకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా ఆరవ సారి ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై మెయిన్ పరీక్షకు సిద్ధమవుతున్నారు.ప్రభుత్వం తరుపున క్రిమినల్ కేసులలోని బాధితులకు న్యాయం అందించే విధంగా కృషి చేస్తానని,అదేవిధంగా నేర విచారణ జరిగే వివిధ ప్రభుత్వ శాఖల తరపున నిందితులకు శిక్షలు పడే విధంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా తాను ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా విధులు నిర్వహిస్తానని తెలిపారు. కాగజ్ నగర్ మండలంలోని బట్టుపల్లి గ్రామంలో సాధారణ కార్మికుడి కుటుంబం శంకరయ్య యశోదమ్మలకు1997లో నంది రవీందర్ జన్మించారు.కాగజ్ నగర్ లోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఆయన గుంటూరులోని నాగార్జున విశ్వ విద్యాలయంలో న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు.మొదటగా మాజీ ఎంపి మధుసూదన్ రెడ్డి అడ్వకేట్ దగ్గర శిష్యునిగా చేరి అనతి కాలంలోనే స్వంతంగా ఆసిఫాబాద్, సిర్పూర్, మంచిర్యాల ప్రాంతాలలో న్యాయ వాదిగా ప్రజలకు సేవలు అందించారు. 2012వ సంవత్సరంలో పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నిర్వహించిన పరీక్షల్లో రెండవ స్థానం సాధించి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఉద్యోగం సంపాదించారు.మొదటగా ఊట్నూర్ న్యాయస్థానంలో విధులు నిర్వహించి,గోదావరిఖని న్యాయ స్థానానికి బదిలీ అయ్యారు.ప్రభుత్వ పరంగా బాధితులకు న్యాయం జరిగేలా వాదించి అనేక మందికి శిక్షలు పడేలా చేసి ఉన్నతాధికారుల నుంచి ప్రశంశలు పొందారు.

# అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ఎసిపికి ఫిర్యాదు



**బెల్లంపల్లి జులై 23 (నినాదం న్యూస్):** తెలంగాణ దళిత సంఘాల ఐక్య వేదిక అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎసిపి రవి కుమార్ మంగళవారం పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పట్టణంలోని మహ్మద్ ఖాసీం బస్తీలో గల ఎస్సి కమ్యూనిటీ హాలును తాకట్టుపెట్టుకున్న వారిపై ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.గత కొద్ది రోజుల కిందట ఎస్సీ కమ్యూనిటీ హాలును కొందరు తాకట్టు పెట్టుకున్న విషయం అందరికి బహిరంగంగా తెలిసిందే,ఈ విషయమై వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఎసిపి ని వారు కోరారు.ఫిర్యాదు చేసిన వారిలో అడహాక్ కమిటీ సభ్యులు మల్లారపు చినరాజం,కుంభాల రాజేష్,రత్నం ఐలయ్య,బుర్ర గోపాల్,దళిత సంఘాల నాయకులు చిలుక రాజ నర్సు,ఆకునూరి రాజ కుమార్,డోలే సురేష్,కలాలి వెంకటేష్,కుష్ణ పెల్లి నారాయణ,ఆసాది మధు,సోతుకు శ్రీనివాస్,దాసరి ప్రతాప్,పైడిమల్ల చంద్రశేఖర్,మద్దెల గోపి,నంది కొమురయ్య,గన్నెర్ల రాజం,భూపెల్లి శ్రీధర్,దుర్గయ్య తదితరులు ఉన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకే కూరగాయల విక్రయ గదులు కేటాయించాలి...



**బెల్లంపల్లి జులై 23 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నూతన కూరగాయల మార్కెట్ దుకాణాల కేటాయింపులో జాప్యం జరుగుతుందని మంగళవారం స్థానిక కూరగాయల వ్యాపారస్తులు బంద్ పాటించారు.ఈ సందర్భంగా పలువురు కూరగాయల విక్రయదారులు మాట్లాడుతు విక్రయ దుకాణాల కేటాయింపులో దుకాణాలు నిజమైన లబ్ధిదారులకు అందడం లేదని నూతన మార్కెట్ లో పలువురు కూరగాయల వ్యాపారస్తులు అన్నారు.కూరగాయల విక్రయానికి ప్రభుత్వం 108 విక్రయ గదులను కేటాయించగా,ఎన్నో సంవత్సరాలుగా కూరగాయల విక్రయమే జీవనాధారంగా జీవిస్తున్న వారికి కాకుండా,ఆర్థికంగా ఉండి ఈ మధ్యకాలంలో వచ్చి కూరగాయలు అమ్ముతున్న వారికే స్థలాలు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో సంవత్సరాలుగా కూరగాయలు విక్రయిస్తు ఇదే వృత్తిగా జీవనం సాగిస్తున్న తమకు కొంతమంది అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి దుకాణాలు కేటాయించాలని లేనిపక్షంలో ధర్నాలకు సైతం దిగుతామని వ్యాపారస్తులు తెలిపారు.ఈ విషయంలో సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

# తమ భూమిలోకి అక్రమంగా చొరబడిన వారిపై చర్యలు తీసుకోవాలి



**బెల్లంపల్లి జులై 23 (నినాదం న్యూస్):** తమ భూమిలో అక్రమంగా సాగు చేస్తున్న వారిపై సంబంధిత ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలి బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామంలోని బాధితులు కోరారు.మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామం సర్వే నెంబర్ 96లో తమ10ఎకరాల భూమిలోకి వేరే వారు చొరబడి సాగు చేస్తున్నారని సంబంధిత పట్టాదారు గోమాస రాజయ్య ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు.మంగళవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతు ఎన్నో సంవత్సరాలుగా10ఎకరాల భూమిని తాము సాగు చేస్తున్నామని,తమ భూమికి ఆనుకోని ఉన్న కొందరు అక్రమంగా తమ భూమిలోకి చొరబడి అక్రమంగా సాగు చేస్తున్నారని వారిపై పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.గత నెల ఎం సి ఈ భూమిని సర్వే చేసి పంచనామా ఇచ్చారన్నారు.భూమి హద్దులు చేసి ఇచ్చినా కూడా ఎంసి సర్వే ను బేఖాతరు చేస్తు తమ భూమిలోకి అక్రమంగా చొరబడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూమిలోకి అక్రమంగా చొరబడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలాని వారు కోరారు..

# విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**మంథని జూలై 23 (నినాదం న్యూస్ ):** మంథని మండలం ఉప్పట్ల గ్రామ శివారులో విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అదే గ్రామంలో నివసించే ఎరుకల నాగరాజు కు చెందిన ఎద్దు గోదావరి నది సమీపంలో మేతకు వెళ్ళగా అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫారం తగిలి మృత్యువాత పడింది. ఎద్దు విలువ సుమారు అరవై వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని నాగరాజు కోరుతున్నారు.

# తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఎందుకు

**-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాదిల శ్రీనివాస్**



**మిర్యాలగూడ, జులై 23 (నినాదం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ ప్రాంతం పై వివక్ష చూపించడం పట్ల మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాడు ఆయన స్థానికంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పై వివక్ష చూపించడం ఆవేదన కలిగిస్తుందని అన్నారు. మూసి రివర్ డెవలప్మెంట్ కొరకు నిధులు అడిగితే అవి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో ఎక్కడ కూడా తెలంగాణ పదం ఉపయోగించకుండా వివక్షతకు దారి చూపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకి లక్షల కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తే రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టు ఏం పాపం చేస్తుందని ఆయన ప్రశ్నించారు . కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై ఇంత వివక్ష చూపటం ఆందోళన కలిగించే విషయమని తమ ప్రభుత్వం ఎంతసేపు కేంద్రంతో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తో మేము స్నేహంగా ఉండాలని చూస్తున్న ఆయన తెలంగాణ రాష్ట్రాన్ని దూరం పెట్టడం మా రాష్ట్రాన్ని అవమానపరిచినట్లుగా భావిస్తున్నామని మా నిరసన వ్యక్తం చేస్తామని ఆయన అన్నారు. మా ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రంతో సఖ్యతగా ఉండాలని చూసినా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పై వివక్ష చూపించడం దురదృష్టకరమని అన్నారు .

## రేణుకా ఎల్లమ్మ దేవి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి



**కుత్బుల్లాపూర్, జులై 23 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ "బి" లో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి, పోచమ్మ కళ్యాణ మహోత్సవ వేడుకలలో బిజెపి నాయకులు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్యఅతిథిగా హాజరై దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయి నేత, నవీన్, సాగర్, ప్రభాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, విశ్వనాథ్, ఆంజనేయులు, యాదగిరి, నారాయణ గౌడ్, విష్ణు గౌడ్, కొండప్ప, చందు, నరేష్ గౌడ్,రాజుయాదవ్, కేశవులు, అంజయ్య ముదిరాజ్, రాజశేఖర్, నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వృక్షో రక్షతి రక్షితః



**ఎల్బీనగర్ నినాదం ప్రతినిధి:** ఒకప్పుడు ఎటు చూసినా పచ్చదనం ప్రకృతి అందాలు కొంగొత్త అందాలతో చెట్లు ఉండేవి అలాంటి పచ్చదనాన్ని మనం కోల్పోతున్నాం, దాన్ని తిరిగి తీసుకురావ డానికి పేరుతో ఊరువాడ మొక్కలు నాటు కార్యక్రమాన్ని మన ప్రభుత్వాలు చేపట్టాయి అందులో భాగంగానే బచ్పన్ - అకాడమిక్ హైట్స్ పాఠశాల కొత్తపేటలో ఈ వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, ఈరోజు పిల్లలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని చెట్లను నాటారు ర్యాలీని నిర్వహించారు నినాదాలు చార్ట్స్ చేసుకుని కార్యక్రమం విజయవంతం చేశారు , ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీమతి జితేంద్ర దేవి గారు మాట్లాడు తూ ప్రతి ఒక్కరు చిన్న పెద్ద అందరు చెట్లని వృక్ష సంపద కాపాడాలని , ప్రతి ఒక్కరు చెట్లు నాటాలని, పంటలు బాగా పండేలా దేశంలో చూసుకోవాలని అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి స్వీటీ మేడం ఉపాధ్యాయునులు పాల్గొన్నారు

# ఘనంగా శివంకు బాబు జన్మదిన వేడుకలు





**మల్కాజిగిరి, జులై 23(నినాదం న్యూస్):** మల్కాజిగిరి మాజీ మైనంపల్లి హనుమంతరావు చిన్న కుమారుడు మైనంపల్లి శివంకు బాబు జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం మౌలాలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతల వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో శివంకు బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతల వినోద్ యాదవ్, మౌలాలి డివిజన్ కాంగ్రెస్ నాయకుల తో కలిసి శివంకు బాబుతో కేక్ కట్ చేయించి, బొకే అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివం బాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, భాస్కర్, షకీల్, నరసింహ, చరణ్, ప్రేమ్, ఉస్మాన్, ఫరూక్, జాన్వి, భాగ్యరాణి, సునీత, పద్మ, కాసింబి, ఇర్ఫాన్, ముక్తార్, ఫైసల్, సంగీత, పద్మ, అజయ్, శ్యామ్, హనుమంత్, హరీష్, నాగరాజ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## బైండోవర్...


**మంథని జూలై 23( నినాదం న్యూస్):** ముత్తారం మండలం లోని ఖమ్మం పల్లి, జిల్లల్ల పల్లి, అడవి శ్రీరాం పూర్ , ఇప్పలపల్లి, లక్కారం గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులను తహసీల్దార్ సుమన్ ఎదుట బైండొవర్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వీరు గుడుంబా అమ్మి దొరకడం తో మరల గుడుంబా అమ్మకుండా ముందస్తుగా బైండొవర్ చేసినట్టు తెలిపారు. ఇప్పటి నుండి సంవత్సరం పాటు వీరు గుడుంబా అమ్మి దొరికితే ఏడాది జైలు శిక్ష తో పాటు లక్ష రూపాయలు జరిమానా విధిస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**మంథని జూలై 23( నినాదం న్యూస్):** ముత్తారం మండలం మైదంబండ గ్రామానికి చెందిన మచ్చ అజయ్ (24) అనే యువకుడు మృతి చెందాడు. సోమవారం అజయ్ మెట్పల్లి నుంచి తన స్వగ్రామం మైదంబండకు కారులో వస్తుండగా ఇందారం సమీపంలోని ఫ్లై ఓవర్ దిగే సమయంలో లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలుతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని జైపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. . అజయ్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## లారీ బైకు ఢీ : ఒకరు మృతి



**సుల్తానాబాద్, జులై 23 ( నినాదం న్యూస్):** లారీ బైకును ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెంది న సంఘటన సుల్తానాబాద్ మండలంనరసయ్య పల్లె స్టేజి వద్ద జరిగింది.పోలీసుల కథనం ప్రకా రం చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గూడ శ్రీనివాస్ గర్రెపల్లి వైపు నుండి రాం గ్ రూట్ లో సుల్తానాబాద్ కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా పెద్దపల్లి నుండి కరీంనగర్ కు వెళు తున్న లారీ వేగంగా బైకును ఢీ కొనడంతో శ్రీని వాస్ కు తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ ఆసుప త్రికి తరలించగా పరిస్థితి విషమించగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ అపోలో ఆసుపత్రికి తరలించగా మరణించాడు.తన తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామనిఎస్సై శ్రావణ్ కు మార్ తెలిపారు.

## నాంపల్లిలో 24న విద్యుత్ గ్రీవెన్స్ డే

**చింతపల్లి, జిల్లా 23 (నినాదం న్యూస్) :**
విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నాంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 24 న గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ మురళీ కృష్ణ తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులు తమ ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు ,పాస్ పుస్తకాలను తీసుకొని రావాలని ఆయన సూచించారు నాంపల్లి పరిధిలోని మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపూడ్ మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న నాంపల్లిలో జరిగే విద్యుత్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో తమ దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి సాధనే మార్గం

- మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్‌సిసితో యువతలో క్రమశిక్షణ
- 10/10 సాధించిన విద్యార్థులను సన్మానించిన కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు






**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జులై 23 ( నినాదం న్యూస్)**
ప్రతి విద్యార్థి పట్టుదలతో చదవాలని ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా. వి. వెంకటేశులు అన్నారు. సోమవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఫలితాలలో ఎంపీసీఎస్ గ్రూపుకు చెందిన ఎస్కే . షాజీద, బిటిజెడ్‌సికి చెందిన ఎస్ స్వాతి 10/10 సాధించారని అదేవిధంగా బిటి జెడ్‌సి గ్రూపుకు చెందిన అక్షర, బిఏహెచ్‌పిఈ రేణు యశస్విని, సిహెచ్ నవ్య శ్రీ, నిషిత 9.5 పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే సాధన ఏకైక మార్గమని తెలిపారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధిస్తారని అన్నారు. అనంతరం విద్యార్థులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్‌సిసితో క్రమశిక్షణ వివిధ కోర్సులలో చేరిన డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఎన్ సి సి విభాగాన్ని సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. ఎన్‌సిసితో విద్యార్థులలో క్రమశిక్షణ , నిస్వార్థత దేశ భక్తి పెరుగుతుందని అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సృజన, జువాలజీ అధ్యాపకులు కవిత, శ్రీనివాస్, నళిని,రజిత, సతీష్ పాల్గొన్నారు.

## అసంపూర్తి ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి

- పల్లా నరసింహారెడ్డి



**చింతపల్లి ,జూలై 23 ( నినాదం న్యూస్) జిల్లాలో**
అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పి. కె మల్లేపల్లి గ్రామంలో వింజమూరి అనంతలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సరైన ప్రణాళికా లేకుండా ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి, బీడు భూములను సస్యశ్యామలం చేయాలని ఆయన కోరారు. షరతులు లేకుండా కట్ ఆఫ్ తేదీలను ఉపసంహరించుకొని రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. 6 గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి, పార్టీలకు అతీతంగా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అందించాలని ఆయన కోరారు. అర్హులైన వారికి పింఛన్లను, ఇండ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండాను గ్రామ గ్రామాన ఎగరవేసి భవిష్యత్తులో, కమ్యూనిస్టు పార్టీ నిర్వహించబోయే పోరాటాలకు ప్రజలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు సాంభా శంకర్, గ్రామ శాఖ కార్యదర్శి ఐతపాక సైదులు, సహాయ కార్యదర్శి ఘనిపల్లి జితేంద్ర, శ్రీకృష్ణ, మల్లయ్య, రామకృష్ణ, కిష్టయ్య, మల్లయ్య, జంగయ్య, విష్ణు, గోపాల్, లచ్చయ్య, దశరథం, బిక్షమయ్య, కొండయ్య, రామచంద్రం, లక్ష్మమ్మ, పర్వతాలు, యాదయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో మాతృశ్రీ ప్రభంజనం

**చౌటుప్పల్ జులై 23(నినాదం న్యూస్)**
మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినిలు మానస (బిఎస్‌సి -ఎంపీసీఎస్)నాల్గవ సెమిస్టర్‌లో 10/10 ఎస్‌జిపిఏ, వనం శివాని(బి.కామ్) ఆరవ సెమిస్టర్‌లో 10/10 ఎస్‌జిపిఏ సాధించగా మరో 56 మంది విద్యార్థులు 9.0 కంటే ఎక్కువ ఎస్‌జిపిఏ సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ డా.సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థులు ప్రణాళికతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మహేందర్ రెడ్డితో పాటు అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలి

- గ్రామస్తుల సహకారం తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**నల్గొండ బ్యూరో, జులై 23(నినాదం న్యూస్ )**
ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని, ఇందుకు గ్రామస్తుల సహకారం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో వనమహొత్సవం కింద మొక్కలు నాటిన అనంతరం పాఠశాలలో చేపట్టిన పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. బ్రాహ్మణ వెల్లెముల పాఠశాలలో అన్ని సౌకర్యాలు బాగున్నాయని, కార్పొరేట్ పాఠశాల మాదిరిగా సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. డైనింగ్ హాల్, కిచెన్, వాటర్ ట్యాప్స్ పాఠశాలలో చేపట్టిన ఆటస్థలం, బాత్రూం అన్నింటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల వంటగదిని మోడరన్ కిచెన్ లాగా తీర్చిదిద్దాలని, ప్లాట్ ఫారం, ఇతర సౌకర్యాలు కల్పించాలని, కట్టెలతో కాకుండా సిలిండర్‌పై వంట చేసేందుకు తక్షణమే రెండు సిలిండర్లు, రెండు స్టవ్‌లను పాఠశాలకు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆరవ తరగతి, పదవ తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల జీవితాలలో మార్పు తీసుకువచ్చేందుకు చదువు ఒక్కటే ఆయుధమని, అందువల్ల చదువుకునే వయసులో సమయం వృధా చేయకుండా కష్టపడి చదవాలని ఆయన విద్యార్థులకు బోధించారు. ఎట్టి పరిస్థితుల్లో చదువును నిర్లక్ష్యం చేయవద్దని, మన జీవితం మన చేతిలోనే ఉందని అందువల్ల కష్టపడి చదవాలని సూచించారు. ఈ సంవత్సరం పదో తరగతిలో పదికి పది జిపిఎ సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. బ్రాహ్మణ వెల్లెముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులతో పాటు ,ఇతర సౌకర్యాలన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మణ వెల్లెముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిద్దేందుకు ముందుకు రావాలని,ఆగస్టు 15 నాటికి గ్రామంలో ప్రయివేటు పాఠశాలలకు పిల్లలను పంపకుండా చూడాలని, ప్రయివేటు పాఠశాల బస్సులు గ్రామానికి రాకుండా పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలకు పంపించేలా గ్రామ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసుకొని చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరగా, ఇందుకు గ్రామస్థులు ఒప్పుకో వడమే కాకుండా వచ్చే ఆదివారమే గ్రామ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అంతేకాక బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. బృహత్ పల్లే ప్రకృతి వనం చిట్టడవిలా పెరగడంతో ఆయన అభినందించారు. మనస్ఫూర్తిగా పని చేసిన చోట పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు బాగున్నాయని, బ్రాహ్మణ వెల్లెముల మాదిరిగానే ఇతర చోట్ల కూడా పెద్ద ఎత్తున పల్లె ప్రకృతి వనాలు,బృహత్ పల్లె ప్రకృతి వనాలను పెంచాల ని డిఆర్‌డిఓ నాగిరెడ్డిని ఆదేశించారు .జిల్లా కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి, డిఆర్డిఓ నాగిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమన్న, డిప్యూటీ ఇంజనీర్ మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.








## మారని ప్రభుత్వ ఆస్పత్రుల తీరు...!

- రక్త పరీక్ష ఫలితం రాక బాధితులు ఆందోళన
- సూపర్డెంట్ దశరథ కు ఫిర్యాదు చేసిన బాధితుడు
- నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి



**కోదాడ,జూలై 23 (నినాదం న్యూస్):**
ప్రతి పేదోడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తుంది. ఈ క్రమంలోనే అనేక లక్షల రూపాయల నిధులతో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటుంది. కానీ ప్రభుత్వం ఒక స్పష్టమైన లక్ష్యంతో ముందుకు కొనసాగుతున్నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతుందని ఆరోపణలు ప్రజల నుండి బలంగా వినిపిస్తున్నాయి. అటువంటి ఆరోపణలు చేసేలా ప్రభుత్వ ఆసుపత్రిలో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కోదాడ పట్టణంలో ని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్ష ఫలితం రాక బాధితులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేస్తూ సూపర్డెంట్ దశరధికు ఫిర్యాదు మంగళవారం చేశారు. పట్టణంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన శ్రీకాకోళ్ల పరిపూర్ణాచారికి గత మూడు రోజుల నుంచి జ్వరం రావడంతో ఈనెల 22వ తేదీన ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రభుత్వ వైద్యశాలలో రక్త పరీక్ష నమూనా ఇచ్చారు. రక్త పరీక్ష ఫలితం చరవాణి ద్వారా సమాచారం రాలేదు. ఫలితం రాకపోవడం ఏంటని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. రక్త పరీక్ష ఫలితాన్ని ఇప్పించాలని సూపర్డెంట్ దశరధ కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే




ఆన్లైన్లో వచ్చిన రిపోర్టు పరిశీలిస్తే మిస్ లేబుల్డ్ శాంపిల్ అని వచ్చింది అని బాధితులు తెలిపారు. చదువుకున్న వ్యక్తులం మాకె ఇలా జరిగితే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

**కారణాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం**
**- ఆస్పత్రి సూపర్డెంట్ దశరథ్**
దీనిపై ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ దశరధ స్పందించి మాట్లాడుతూ... దీనికి కారణాలను పరీక్షించి చర్యలు తీసుకుంటామని వారికి మెమోలు కూడా జారీ చేస్తామని తెలిపారు.

## రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలి

**పలిమేల జూలై 23 నినాదం న్యూస్**
కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు అంటే 28/06/2024లోపు వచ్చిన రైతులు, గతంలో రైతు భీమా చేసుకొని రైతులు రైతు బీమా జూలై 30 వరకు వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోగలరు, ఇందుకు గాను రైతు నింపిన దరఖాస్తు ఫారం, కొత్తగా వచ్చిన పట్టా పాస్ పుస్తకం, నామిని ఆధార్ కార్డ్ ఇవ్వగలరని పలిమేల వ్యవసాయ విస్తరణ అధికారి తెలిపారు .

## నవోదయలో ప్రవేశం పొందిన వివేకవర్ధిని విద్యార్థి

- విద్యార్థిని అభినందించిన కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్

**కేసముద్రం జూలై 23 నినాదం న్యూస్**



మండలంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థికి మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం నిర్వహించిన 9వ తరగతి ప్రవేశ పరీక్షలో పాఠశాలకు చెందిన ఎశబోయిన శివ చైతన్య సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. 9వ తరగతిలో ఏర్పడిన ఖాలీలను పూర్తి చేయడానికి నిర్వహించిన పరీక్షల్లో శివ చైతన్య ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా యాకాంతం గౌడ్ మాట్లాడుతూ 2021- 22, 2022 - 23 మరియు 2023 - 24 విద్యా సంవత్సరంలో వరుసగా మూడుసార్లు నవోదయ 5వ తరగతిలో సీటు సాధించడమే కాకుండా ఈ విద్యా సంవత్సరం 9వ తరగతిలో కూడా పాఠశాల విద్యార్థి సీటు సాధించడం గర్వించదగ్గ విష యం అన్నారు. ప్రిన్సిపల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

- ద్విచక్ర వాహనాన్ని వెనకవైపు నుండి ఢీకొట్టిన కారు



**కోదాడ,జూలై 23 (నినాదం న్యూస్):**



ద్విచక్ర వాహనాన్ని కారు వెనుక వైపు నుండి ఢీకొట్టడంతో సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్నగర్ బైపాస్ 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణంలోనీ అంబేద్కర్ కాలనీకి చెందిన, చింతా రాజు (23) సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఉత్తమ్ పద్మావతి కాలనీలో తన సొంత ఇల్లు నిర్మించుకుంటున్న క్రమంలో ఇంటికి వాటర్ కొట్టేందుకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్తున్న కారు వెనుక నుండి ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న కోదాడ పట్టణ పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## నాంపల్లిలో 24న విద్యుత్ గ్రీవెన్స్ డే

**చింతపల్లి, జిల్లా 23 (నినాదం న్యూస్)**
విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నాంపల్లి మండల కేంద్రంలో ఈ నెల 24 న గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ మురళీ కృష్ణ తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులు తమ ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు ,పాస్ పుస్తకాలను తీసుకొని రావాలని ఆయన సూచించారు నాంపల్లి పరిధిలోని మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపూడ్ మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న నాంపల్లిలో జరిగే విద్యుత్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో తమ దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి : డివైఎఫ్ఐ



**చౌటుప్పల్ జులై 23(నినాదం న్యూస్)**
అకాల వర్షాలకు వలిగొండ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రోడ్లను పరిశీలించి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె మధుకృష్ణ మాట్లాడుతూ,అకాల వర్షాల కారణంగా వలిగొండ రోడ్డు గుంతల మయంగా మారడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. గుంతల మయంగా మారిన రోడ్లను పరిశీలించారు. అనంతరం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆర్డీవో కార్యాలయంలో డిఎఓ శ్రీనివాస్‌కి మెమోరడం అందించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీకి పనిరిత్యా వచ్చినప్పుడు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. అధికారులు స్పందించని యెడల రోడ్డు దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు. రాస్తారోకో కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం సంఘీభావం ప్రకటించారు. రాస్తారోకో కార్యక్రమంలో చిన్న కొండూరు మాజీ ఎంపీటీసీ చెన్నబోయిన వెంకటేశం,డివైఎఫ్ఐ నాయకులు యానాలా రాజశేఖర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు ఉష్కాగుల రమేష్, పల్లె అనిల్ కుమార్, ముప్పిడి పాండు, పల్లె రమేష్, అందె శివ శంకర్, బొంగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం ప్రకటనతో కదిలిన అధికార యంత్రం

అబ్బాయి పాలెం లో బీజింగ్,ఫాగింగ్ చేపట్టిన సిబ్బంది

**డోర్నకల్ జులై 23(నినాదం న్యూస్)**



మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయి పాలెం గ్రామంలో సిపిఎం ప్రకటనపై అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో హెల్త్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఆమె కాలనీలను సందర్శించారు. బురద ఉన్నచోట బీజింగ్ పౌడర్, సైడ్ కాలవలో దోమల నివారణకు పాగింగ్ చేపట్టారు. అంతేగాక వర్షం తగ్గినంక బురద రోడ్లలో మొరంమట్టి తో రోడ్లు మరమ్మతులు చేపడతామని తెలిపారు.అంతేగాక ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండ్ల ముందు పరిసరాల ప్రాంతాలలో శుభ్రతను పాటించాలని గ్రామ ప్రజలకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఏఎన్ఎం బోడ విజయ, ఆశా కార్యకర్త రెహల, గ్రామపంచాయతీ కారోబర్ అలవాల యాదగిరి,మల్టీపర్పస్ వర్కర్ జినక వెంకన్న, గంధసిరి రవి, తదితరులు ఉన్నారు.

## చెరువు భూమిలో రోడ్డు వేసే వారిపై చర్యలు తీసుకోవాలి

**మిర్యాలగూడ, జూలై 23(నినాదం న్యూస్ )**



మిర్యాలగూడ మండలంలో నందిపాడు రెవిన్యూ శివారు చెరువు శిఖం సర్వే నంబర్ 294లో ఆక్రామిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కె. నాగరత్నం మంగళవారం స్థానిక తహసీల్దార్ ఎన్. హరిబాబుకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. సంద్రాల సైదులు, బుచ్చయ్య వారి కుటుంబ సభ్యులు శిఖం భూమిలో రోడ్డు వేస్తున్నారని అడ్డుకున్న వారిపై గొడవ పడ్తున్నారని శ్రీధర్ బాబు, మాతంగి సైదమ్మ, భద్రమ్మ, చెరుపల్లి సైదులు కూడా ఆరోపించారు. వారు ఆర్డీఓకు ఫిర్యాదు చేయగానే విచారణ జరిపినట్లు తహసీల్దార్ వివరించారు. ఆర్డీఓ కు నివేదిస్తామని పేర్కొన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీడీఓ

**మిర్యాలగూడ, జూలై 24:-(నినాదం న్యూస్)**
మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రం, పాఠశాల, పారిశుధ్య పనులను ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ మంగళవారం పరిశీలించారు. మురుగు కాలువల్లో మురుగు తొలగించి, పిచ్చి మొక్కలు పీకి వేశారు. ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ పరిశీలించారు. ఆశవర్కర్లు గర్భిణీలకు బాలింతలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీలు చేయించాలని సూచించారు. మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల సందర్శించి ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను బోధించాలని సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పని చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం వండుట పరిశీలించి నాణ్యతతో వేడిగా తయారుచేసి విద్యార్థులకు అందించాలని కోరారు. చిన్నపిల్లలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, గుడ్లు, బాలామృతం, పాలు సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు.

